# కీ. శే. శ్రీ కిడాంబి రఘునాథ్

- వేమూరి వేంకట రామనాథం

క. అడుగకె నీరమ్ములు కురి
సెడు మేఘము వోలె నీదు జీవిత మలరెన్;
అడుగకె మంగళ మొనరుచు
మడి వేలుపు టొడికి మాకు మఱుగై చనితే.

క. ఇరు లల్లిన కుహరము మా
దిరి బ్రదుకుట కన్న చంద్ర తేజో రేఖా
క్షర ధగధగ మెఱుగు గదా;
ధరపై నీ యునికి యట్టి దయ్యా, రఘునాథ్.

క. నాలుగు తల లాతనికిని
వేలముగా దున్ననెక్కి వెడలెడు దొరకున్
కేళి గదా బొంగరముల
లీలగ మన తలలు చిత్ర రీతి దొరల్చన్.

క. ప్రభకును ఉషకునె కాదీ
విభావరీ రహిత దృశ్యవేదన; యమిత
క్షుభితము తెలుగు సమితి నీ
అభావ కర్కశత లోని యదరున, రఘునాథ్.

క. నారాయణ శరణాగతి
యే రమ్యతమాచరణగ నిట బ్రదికిన నీ
కా రంగనాథు భూరి కృ
పా రోచి స్సొసగుగాత బంధ విముక్తిన్.

క. దీపావళి వెలుగులతో
ఏ పున్నెపు టూర్ధ్వలోక మేగితివయ్యా!
మా పావిత్ర్య స్మృతిలో
మాపని మెఱపైతివయ్య, మా రఘునాథా.

క. నీ "తెలుగు జ్యోతి" యెంతగ
నీ తె.క.స.కు కీర్తి స్మూత్ర నియతిగ మనునో,
నీ తారళ్య ప్రజ్ఞా
ఖ్యాతియు నట్టులనె నిల్చు గద రఘునాథా.

క. బ్రతికి పుడమి పయి మెలగిన
ప్రతివానికి "జన్మ హక్కు" వంటిది కాదా
మృతి! అమృతిగ, నినువలె, శా
శ్వతమగునది "హితు" డటన్న పరపతి యొకటే.

క. నీ మిత్రుడు నాపుత్రుడు
వేమూరి శివరామకృష్ణ వినువీధులలో
నే మూల దాగి యుండునో !
ఈ మధ్యనె, నీకు తెలియు, నేగె నిటులనే.

క. కలరు వియత్తల మందున
తెలుగున కాకృతియు నుతియు తెచ్చిన రస సి
ద్ధులు; కొఱత లేదు రచన
మ్ముల, కటనొక "తెలుగు జ్యోతి" మొదలిడుమయ్యా.